ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కర్ణాటక వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024



గవర్నర్ నిర్ణయంపై పోరాటం చేస్తా : ఇబ్రహీం

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై పోరాటం చేస్తానని జేడీఎస్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మండిపడ్డారు. ఆదివారం అధికారిక నివాసంలో సీఎం సిద్దరామయ్యను భేటీ అయ్యాక ఆయన మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను గవర్నర్ ఉల్లంఘించారని మండిపడ్డారు. కేంద్రమంత్రి కుమారస్వామితోపాటు పలువురిపై రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు చేసినా ఎందుకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని తెలిపారు. కొన్నేళ్లుగా రాజకీయ విభేదాలతో సీఎంకు దూరంగా ఉన్నానని, ఇకపై ఆయనతోపాటు ఉంటా అన్నారు.


సిద్దరామయ్య

న్యాయ పోరాటానికి కాంగ్రెస్ కసరత్తు

ఇక రాజకీయ సమరం

సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్


థావర్‌చంద్ గెహ్లాట్

రాష్ట్రమంతటా నిరసనలకు పిలుపు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులంతా ఒక్కటయ్యారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఇంటి స్థలాల అవినీతిలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ అనుమతులు ఇవ్వడంతో ఒక్కసారిగా ప్రభుత్వంలో సంచలనం చోటు చేసుకుంది. గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. కురబ సంఘం ప్రతినిధులు రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. శాసనసభ సమావేశాల్లో ముడా అవినీతి అంశాన్ని లేవనెత్తి దాదాపు 25 రోజులుగా పాదయాత్రలు, నిరసనలతో హోరెత్తించిన బీజేపీ నాయకులు తమ ఆందోళనకు తొలి విజయం లభించిందని, ఇక ముఖ్యమంత్రి రాజీనామా తమ లక్ష్యం అంటూ సవాల్ విసురుతున్నారు. శనివారం గవర్నర్ ఇచ్చిన అనుమతులపై సోమవారం నుంచి అసలైన పోరాటానికి తెర లేవనుంది.

నేడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

రాజ్ భవన్‌ను దుర్వినియోగం చేశారని, కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని, బీజేపీ-జేడీఎస్ రాష్ట్ర నాయకుల డిమాండ్లకు తలొగ్గారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సోమవారం రాష్ట్రమంతటా నిరసనల హోరు సాగించాలని తీర్మానించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పోరాటానికి సిద్ధం కావడంతో అన్ని జిల్లా కేంద్రాల్లో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధానంగా బెంగళూరు, మైసూరుతోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో శనివారం నుంచే భద్రతా ఏర్పాట్లు చేశారు. సోమవారం అన్ని జిల్లా అధికారుల కార్యాలయాల వద్ద మరింత బందోబస్తు కొనసాగించాలని నిర్ణయించినట్టు సమాచారం. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు ఇప్పటికే చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే పోరాటానికి కసరత్తు చేస్తున్నారు. ప్రతిచోటా వేలాదిమంది కార్యకర్తలను సమూహపరిచేలా సిద్ధమవుతున్నారు. కనీసం అర కిలోమీటరు నుంచి కిలోమీటరు దాకా పాదయాత్ర చేసి జిల్లా అధికారికి వినతులు ఇవ్వనున్నారు. మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంతోపాటు జిల్లా కేంద్రాల్లోని ఆ పార్టీ ఆఫీసుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు మాత్రమే అనుమతులు ఇచ్చారు. ముఖ్యమంత్రి హైకోర్టును ఆశ్రయించి వాటిని రద్దు పరుచుకునే ప్రయత్నం చేయవచ్చు. ఇక్కడ సాధ్యం కాదంటే సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. ఇలా సీఎం ఇక నిత్యం పాలనవైపు కాకుండా న్యాయపోరాటంవైపు దృష్టి సారించనున్నారు. ప్రాసిక్యూషన్ అనుమతులను రద్దు చేయించడం లేదా వాయిదా కోరే వెసులుబాటు ఉంది. ఇందుకోసం ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మనుసింఘ్వి రంగంలోకి దిగుతున్నారు. సోమవారం హైకోర్టులో దాఖలు చేసే పిటిషన్‌పై రాజకీయ వర్గాల్లో కుతూహలం నెలకొంది.

సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్

ముడా అవినీతిలో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలంటే ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ కార్కళ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. సీఎం రాజీనామా కోరుతూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సోమవారం విధానసౌధలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టనున్నారని ఎమ్మెల్సీ రవికుమార్ ప్రకటించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎంపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులిచ్చిన గవర్నర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునివ్వడం సరికాదన్నారు. చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు గవర్నర్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, కాంగ్రెస్ విధానాలను ఖండిస్తూ గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యేలందరూ నిరసన తెలుపుతారని అన్నారు. ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేసేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 2011లో గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ అప్పటి సీఎం యడియూరప్పకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతులివ్వడాన్ని సాదరంగా స్వాగతించిన సిద్దరామయ్య ఇప్పుడు తన దాకా వస్తే వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పుడు రాజ్యాంగంలో మార్పు జరిగిందా..? అని నిలదీశారు. 1988 చట్టం 17ఏ సెక్షన్ కింద విచారణకు అనుమతులకు ఇచ్చారన్నారు. ఇతరులదైతే అవినీతి అని, వీరిదైతే రాజకీయం అని వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు. తమ భూమికి సీఎం రూ.62కోట్ల పరిహారం కోరారని, 2013 ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ తప్పిదంపైనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2018లో 14 స్థలాల విలువ రూ.25 లక్షలు కాగా, 2023లో రూ.8 కోట్లు ఎలా అయ్యిందని, ఇప్పుడు ఏకంగా రూ.62 కోట్లు ఇవ్వాలని ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. చట్టపరంగా ప్రతి అడుగులోనూ తప్పు చేశారన్నారు. అధికార ప్రతినిధి అశ్వత్థనారాయణ మాట్లాడుతూ సిద్దరామయ్యకు డిఫెన్స్ టీమ్ ఉందని, ఇందులో కృష్ణబైరేగౌడ, దినేశ్ గుండూరావు, ప్రియాంక ఖర్గే ఉన్నారని, వారు రికార్డులు పరిశీలించరని, నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటారని మండిపడ్డారు.

ఫిర్యాదుదారుల వ్యూహం ఏమిటో...?

ముడా అవినీతిలో గవర్నర్‌కు ముగ్గురు ఫిర్యాదు చేశారు. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతులు ఇవ్వడంతో వీరి వ్యూహం కీలకం కానుంది. ఫిర్యాదుదారుల్లో ఒకరైన నాగరబావికి చెందిన ప్రదీప్‌కుమార్ ఈ వివాదంలో సీఎంకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్టే లేదా రద్దు ఇవ్వరాదని కోరుతూ కేవియట్ దాఖలు చేశారు. కీలక ఫిర్యాదుదారుడు టీజే అబ్రహాం సోమవారం కేవియట్ వేయనున్నట్టు ప్రకటించారు. ఈ వివాదంపై ఇప్పటికే మైసూరులో లోకాయుక్త వద్ద ఫిర్యాదు ఉంది. దీంతో లోకాయుక్త పోలీసులు తదుపరి ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు వీలుంది. ఫిర్యాదుదారుడు కేవియట్ వేయడంతోపాటు సీబీఐతోపాటు ఇతర దర్యాప్తు సంస్థల విచారణ కోరుతూ కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.

కార్మికుల శ్రమ మరువలేనిది


కన్నయ్య నాయుడును సన్మానించిన టీబీ బోర్డు అధికారులు

కార్మికులతో కలెక్టర్ దివాకర్, ఎమ్మెల్యే గణేష్ తదితరులు

విజయనగర కలెక్టర్ దివాకర్

మంత్రి జమీర్ ఇచ్చిన రూ.50వేల నజరానా పంపిణీ

హొస్పేట్, బళ్లారి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన దాని స్థానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్ పనుల్లో శ్రమించి విజయవంతం చేసిన కార్మికుల శ్రమ చిరస్థాయిగా గుర్తుండిపోతుందని విజయనగర జిల్లా కలెక్టర్ దివాకర్, కంప్లి ఎమ్మెల్యే గణేష్ కొనియాడారు. విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ సొంతగా ఒక్కొక్క కార్మికుడికి రూ.50వేలు నగదు బహుమతిని అందిస్తానని శనివారం ప్రకటించారు. ఇందులో భాగంగా మంత్రి ఇచ్చిన నగదు బహుమతిని ఆదివారం విజయనగర కలెక్టర్ దివాకర్, కంప్లి ఎమ్మెల్యే గణేష్ తుంగభద్ర బోర్డు కార్యాలయం వద్ద సన్మానించి, ఒక్కొక్క కార్మికుడికి రూ. 50 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ డ్యాం నుంచి బయటకు నీరు వెళ్లకుండా స్టాప్‌లాగ్ బిగించే పనులు సాహసోపేతంగా చేశారని కొనియాడారు. ఎంతో ఎత్తు నుంచి నడుముకు గొలుసులను కట్టుకుని గాలిలో వేలాడుతూ పనులు చేయడం సామాజిక మాధ్యమాల్లో చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. కార్యక్రమంలో కార్మికులకు శాలువాలు కప్పి పుష్పమాల వేసి సత్కరించారు.

నేటి తరానికి కన్నయ్యనాయుడు ఆదర్శం

ఈనాటి తరం ఇంజనీర్లు, యువతకు క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు ఆదర్శప్రాయుడని తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి కొనియాడారు. కన్నయ్యనాయుడును ఆదివారం టీబీ బోర్డు అధికారులు డ్యాం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఓఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ 104 టీఎంసీల నీటి సామర్థ్యంతో జలాశయం తొణికిసలాడిందన్నారు. రైతులు సంతోషంతో ఉన్నారని, అప్పుడే డ్యాంకు క్రస్ట్ గేటు రూపంలో ముప్పు తరుముకొచ్చిందన్నారు. నీరంతా కొట్టుకుపోతుందని ఆందోళన చెందామని, అలాంటి సంక్లిష్ట సమయంలో కన్నయ్యనాయుడు ఆపద్బాంధవుడిలా అందరినీ ఆదుకునేందుకు వచ్చారని కొనియాడారు. తన అపార అనుభవంతో డ్యాంకు స్టాప్‌లాగ్ అమర్చి మూడు రాష్ట్రాల రైతులకు జీవం పోశారని అన్నారు. అనంతరం పుష్పమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈలు నీలకంఠరెడ్డి, రవిచంద్ర, ఎస్‌డీవోలు గోపీ, జ్ఞానేశ్వర్, అమర్‌నాథ్‌రెడ్డి, రాఘవేంద్ర, ప్రదీప్ సోమశేఖర్ కొనియాడారు. అనంతరం కన్నయ్యనాయుడు జిందాల్ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆయనతో పాటు మనవడు సురేష్‌బాబు వెంట ఉన్నారు. బోర్డు అధికారులు విమానాశ్రయం వరకూ వెళ్లి వీడ్కోలు పలికారు.

భద్రకు వాయనం సమర్పించిన మంత్రి

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లాలోని భద్ర జలాశయానికి గనులు, భూవిజ్ఞానం, ఉద్యానవనాలశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ వాయనం సమర్పించారు. ఆదివారం మధ్యాహ్నం తొలుత డ్యామ్ వద్ద ప్రత్యేక కళశాలకు పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మధ్యకర్ణాటక ప్రాంత ప్రజలకు జీవనాడిగా భద్ర జలాశయం ఉందన్నారు. వరుణదేవుడి కృపతో జలాశయాలు జలకళ సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ ప్రభా మల్లికార్జున్, ఎమ్మెల్యేలు బసవరాజు, వి. శాంతనగౌడ, బసవంతప్ప, జిల్లా అధికారి డాక్టర్ గంగాధర స్వామి, జడ్పీ సీఈఓ సురేశ్ జిట్నాళ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హెచ్‌బీ మంజప్ప, పాలికె సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వాయనం సమర్పిస్తున్న మంత్రి మల్లికార్జున్

నన్నే టార్గెట్టా..?





- వెంటాడిన బీజేపీ, జేడీఎస్
- అసెంబ్లీలో రాత్రిపగలు నిరసన
- పాదయాత్రతో మరింత ఒత్తిడి
- పోటీగా కాంగ్రెస్ జనాందోళన సభలు
- మైసూరు సభలో సీఎం ఉగ్రరూపం
- సీఎంకు అండగా నిలిచిన డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను లక్ష్యంగా చేసుకునే జరుగుతున్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గవర్నర్‌కు ఫిర్యాదు అందడం, ఆ వెంటనే నోటీసులు ఇవ్వడం వంటి పరిణామాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.నాలుగు దశాబ్దాలుగా ఎన్నో రాజకీయ సంచలనాలను చూసి.. అంచలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి వచ్చిన సిద్దరామయ్య మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇళ్లస్థలాల అక్రమాల విషయంలో ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ముడా అక్రమాలపై సీఎంను ప్రాసిక్యూషన్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్‌గెహ్లాట్ అనుమతులు ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వంలో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. ముడాలో ఇంటి స్థలాల వివాదం శాసనసభ కార్యకలాపాల నుంచి తారస్థాయికి చేరింది. బీజేపీ, జేడీఎస్ ఉభయసభల్లో లేవనెత్తిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించగా, సభాపతి ఏకంగా న్యాయవిచారణ కమిటీ పరిధిలో ఉన్నందున సాధ్యం కాదని తేల్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు రాత్రి పగలు అసెంబ్లీలోనే నిరసనకు దిగగా ఒక రోజుకు ముందే సమావేశాలను ముగించారు. దీంతో బీజేపీ, జేడీఎస్ ఉమ్మడిగా చలో మైసూరు పాదయాత్ర చేపట్టాయి. ఈలోగానే రాజ్‌భవన్ నుంచి ముఖ్యమంత్రికి నోటీసులు వచ్చాయి. పాదయాత్రను కట్టడి చేసేలా కాంగ్రెస్ పార్టీ జనాందోళన పేరిట బెంగళూరు నుంచి మైసూరు దాకా రోజుకో చోట సభలు నిర్వహించింది. గతంలో ఏ పార్టీ వ్యవహరించని రీతిలో పాదయాత్రకంటే ముందుగా ఓ ట్యాగ్‌లైన్‌తో సభలు జరిపిన సంప్రదాయాలు లేవు. కానీ అధికారంలో ఉంటూ కాంగ్రెస్ కొత్త సంప్రదాయానికి తెరలేపింది. గత శుక్రవారం మైసూరులో సభ సత్యమేవ జయతే పేరుతో జనాందోళన ముగింపు నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య ఆగ్రహం తారస్థాయికి చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవహరించారు. గతంలో కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రులైన దేవరాజ్ అరసు, బంగారప్ప, వీరప్ప మొయిలీని పదవి నుంచి దించేందుకు కుట్రలు సాగాయని ప్రస్తావించారు. వెనుకబడినవర్గాల ముఖ్యమంత్రులను బలమైన సామాజికవర్గాలు రాజకీయ కుట్రలు నడిపి అధికారంలో కొనసాగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. పరోక్షంగా తనపై కుట్రకు దిగే వారికి తగిన గుణపాఠం చెబుతానని హెచ్చరించారు. గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన తర్వాత ఒక్కరోజులోనే రెండు మూడుసార్లు పార్టీ నాయకులు, సహచర మంత్రులను సిద్దరామయ్య కొనియాడారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా నేరుగా సిద్దరామయ్యకు ఫోన్ చేసి అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఆ వెంటనే డీసీఎం డీకే శివకుమార్ నేతృత్వంలో దాదాపు మంత్రులంతా సిద్దరామయ్యకు మద్దతు పలికారు. అత్యవసర కేబినెట్ ముగిసిన తర్వాత సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ మంత్రులు, ఢిల్లీ నేతలను ప్రత్యేకంగా కొనియాడారు. గవర్నర్, కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

గతంలోనూ అనూహ్యంగా సీఎంల మార్పు

దేవరాజ్ అరసు, బంగారప్ప కాంగ్రెస్‌లోని వర్గవిభేదాలతోనే తమ పదవులను కోల్పోయారు. చిక్కమగళూరు లోక్‌సభ ఉప ఎన్నికల తర్వాత దేవరాజ్ అరసు, ఇందిరాగాంధీ మధ్య భేదాభిప్రాయాలు తారస్థాయికి చేరి అధికారం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అరసుతో కలసి ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు కొన్ని గంటల్లోనే ఇందిరాగాంధీ వైపు మద్దతుగా నిలవడంతో మార్పు అనివార్యమైంది. బంగారప్ప ముఖ్యమంత్రి పదవి కోల్పోయేందుకు క్లాసిక్ కంప్యూటర్ అవినీతి ఆరోపణలు కారణమయ్యాయి. అప్పుడు కూడా ఢిల్లీలో కాంగ్రెస్ నాయకత్వం బలంగా ఉండేది. అంతకుముందు అనారోగ్యంతో ఉన్న ముఖ్యమంత్రి వీరేంద్రపాటిల్‌ను బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో రాజీవ్‌గాంధీ చర్చలు జరిపారు. ఆయన ఢిల్లీ వెళ్లిన తర్వాత సీఎం మార్పు సూచనలు చేశారు. వీరేంద్రపాటిల్‌కు సన్నిహితంగా ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు బంగారప్పవైపు వెళ్లడంతోనే మార్పు అనివార్యమైంది. ఇక వీరప్పమొయిలీ సీఎంగా ఉన్నప్పుడు ఆయనపై ఆరోపణలు తీవ్రమయ్యాయి. వ్యతిరేక ఎమ్మెల్యేలను సమైక్యపరచడంలో డీకే శివకుమార్ కీలకంగా వ్యవహరించారు. అప్పటి ఉపముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ, మంత్రి రాజశేఖరమూర్తి వ్యతిరేక కూటమికి నేతృత్వం వహించారు. అధిష్ఠానం మొయిలీకి మద్దతు ఇవ్వడంతో అధికారం నుంచి తప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఢిల్లీ నుంచి పరిశీలకులుగా వచ్చిన జగన్నాథ మిశ్రా సమక్షంలోనే ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని కాంగ్రెస్ కార్యాలయం ముందు మొయిలీ సానుభూతిపరులు, వ్యతిరేకులు చితకబాదుకున్నారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి తెరపైకి వస్తోంది. వెనుకబడిన వర్గాలకు చెందిన తనను అధికారం నుంచి తప్పించేందుకు బలమైన సామాజికవర్గాలు కుట్ర పన్నుతున్నాయని బహిరంగంగా చెప్పడం ద్వారా సిద్దరామయ్య మరో వివాదానికి తెరతీశారు. సిద్దరామయ్య అవినీతికి పాల్పడ్డారని ప్రస్తుతం ఆందోళన చేసింది బీజేపీ, జేడీఎస్. ఆయన మాజీ సీఎంల ప్రస్తావనలు తెచ్చి సొంతపార్టీకి చెందినవారి కుట్రలను బహిరంగం చేశారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్ సీఎం పదవికి పోటీ పడడంతో ఢిల్లీ నేతలు సర్దుబాటు చేశారు. ఆ ఒప్పందం ఏమిటనేది అంతుచిక్కని రహస్యంగా ఉంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సిద్దరామయ్య అనివార్యమై పదవిని వదులుకుంటే ఏం జరుగుతుందనేది కీలకమైన అంశంగా మారుతోంది.

డీకే శివకుమార్‌లో మార్పు ఏమిటో..?

నెలరోజుల క్రితం దాకా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మైండ్‌గేమ్ ఆడిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒక్కసారిగా సీఎంకు పూర్తిగా అనుకూలంగా మారడం చర్చనీయాంశమవుతోంది. సిద్దరామయ్య సుదీర్ఘంగా సీఎంగా కొనసాగుతారని ఎవరు వ్యాఖ్యానించినా అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగి మందలించేది. ముడా అవినీతి అంశం శాసనసభలో ప్రస్తావనకు వచ్చినప్పటి నుంచి డీకే శివకుమార్ వైఖరిలో మార్పు వచ్చింది. సిద్దరామయ్యకు అండగా కొండలా నేనుంటా.. ఎంతటి పరిస్థితులైనా ఢీ కొంటానని సవాల్ చేయడం ఆశ్చర్యపరుస్తోంది. సిద్దరామయ్యపై ఆరోపణలు వచ్చిన తర్వాత మార్పు అనివార్యమైతే అనే అంశంపైనా చర్చలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఒక్కలిగ, లింగాయత సామాజికవర్గాలు బలమైనవి. ప్రస్తుతం సిద్దరామయ్యకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలన్నీ మద్దతు ఇస్తున్నాయి. ఏమాత్రం ఆవేశపడినా అసలుకే ఎసరు వస్తుందని డీకే శివకుమార్‌లో మార్పు వచ్చినట్టు తెలుస్తోంది

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శంకర్ దయాళ్ శర్మ (జయంతి)



తొమ్మిదో రాష్ట్రపతిగా వ్యవహరించిన శంకర్ దయాళ్‌శర్మ 1918 ఆగస్టు 19న మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పండితుడు. 1987 నుంచి 1992 వరకు ఉప రాష్ట్రపతిగాను, 1992 నుంచి 1997 వరకు రాష్ట్రపతిగాను వ్యవహరించారు. అంతకు పూర్వం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ, న్యాయశాఖ తదితర శాఖల్లో కేంద్రమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1972-74 మధ్య కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగారు. శృంగేరి పీఠం నుంచి రాష్ట్ర రత్నం, శ్రావణ బెళగొళ నుంచి ధర్మ రత్నాకర తదితర గౌరవాలు అందుకున్నారు. 1999 డిసెంబరు 26న కన్నుమూశారు.

స్వామి సచ్చిదానంద సరస్వతి (వర్ధంతి)



స్వామి సచ్చిదానంద సరస్వతి 1914 డిసెంబరు 22న తమిళనాడు రాష్ట్రం కుడలోర్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సీకే రామ స్వామి గౌండర్. భక్తి, ఆధ్యాత్మిక వేత్త, యోగా గురువుగా రాణించారు. తత్వశాస్త్రం, ఆధ్యాత్మికతలపై పలు పుస్తకాలు రచించారు. ఆసియా ఖండ వ్యాప్తంగా పర్యటించి యోగా, శాంతి, ఆరోగ్యంపై పలు ప్రసంగాలు చేశారు. 2002 ఆగస్టు 19న కన్నుమూశారు.

సుధామూర్తి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సుధామూర్తి 1950 ఆగస్టు 19న కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లా శిగ్గావ్‌లో జన్మించారు. సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రజారోగ్య విభాగాలలో కీలకపాత్రను పోషిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్‌లు అందించి పేద విద్యార్థులు కూడా ఉచితంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పొందేలా ప్రోత్సహిస్తున్నారు. ఆమె రచించిన కన్నడ నవల 'డాలర్ సొసె' (డాలర్ కోడలు) ఆంగ్లంలో డాలర్ బహూగా అనువాదమైంది. తర్వాత ఈ నవల 2001లో జీ టీవీలో ధారావాహికగా ప్రసారమైంది. పద్మభూషణ్ వంటి ఉన్నత గౌరవం, 2023లో సాహిత్య అకాడమీ నుంచి బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు.

బిల్‌క్లింటన్ (పుట్టినరోజు)



అమెరికా దేశ అధ్యక్షుడిగా వ్యవహరించిన బిల్ క్లింటన్ 1946 ఆగస్టు 19న జన్మించారు. 42వ అధ్యక్షుడిగా 1993 నుంచి 2001 వరకు వ్యవహరించారు. పూర్తి పేరు విలియమ్ జెఫర్సన్ క్లింటన్. అమెరికా అధ్యక్షుడిగా ప్రజలలో మంచి ఆదరణ పొందారు. 2003, 2005లో గ్రామీ అవార్డు అందుకున్నారు. అధ్యక్ష పదవి అనంతరం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రెసిడెన్సియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

సత్యనాదెళ్ల (పుట్టినరోజు)



సత్యనారాయణ నాదెళ్ల అలియాస్ సత్య నాదెళ్ల భారతీయ అమెరికన్ వ్యాపార నిర్వాహకుడు. 1967 ఆగస్టు 19న హైదరాబాద్‌లో జన్మించారు. స్టీవ్‌బామర్ తర్వాత మైక్రోసాఫ్ట్ సంస్థకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు క్లౌడ్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సీఈఓ బామర్ రిటైర్మెంట్ ప్రకటించిన తరుణంలో సత్య నాదెళ్ల ప్రతిభకు అవకాశం దక్కింది. అంతర్జాతీయ స్థాయి సంస్థకు ఛైర్మన్ అండ్ సీఈఓగా మంచి పేరు పొందారు. 2022లో పద్మ భూషణ్ పురస్కారం అందుకున్నారు. జార్జియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

రేపటి నుంచి రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు



స్వామికి ప్రత్యేక అలంకరణ

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి వారి మఠం ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు 353వ ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మంగళవారం పూర్వఆరాధన, బుధవారం మధ్య ఆరాధన, గురువారం ఉత్తర ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరాధన సమయంలో సంపూర్ణ అలంకారసేవ, అన్నసంతర్పణసేవ, పుష్పాలంకరణ సేవ, విశేషఫల పంచామృతాభిషేక సేవ, కనక మహాపూజ, రజత పుష్పార్చన, సర్వసేవ, పల్లకీ ఉత్సవ సేవ, హస్తోదకసహిత పంచామృతాభిషేక సేవలు నిర్వహిస్తామన్నారు. కావున భక్తాదులు ఈ ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. పూజ కార్యక్రమాలకు సంబంధించి మరిన్ని వివరాలకు 94412 30303, 95737 51918ను సంప్రదించాలని కోరారు.

ప్రతిభా విద్యార్థులను ప్రోత్సహించాలి

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంత విద్యార్థులను సమాజంలో అన్ని సంస్థలు ప్రోత్సహించాలని చరణ్ సౌహార్ద కో-ఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపకుడు బీవీ ద్వారకనాథ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం బ్యాంకు 28వ సర్వసభ్య సమావేశం జరిగింది. బ్యాంకు రూ.2.89 కోట్ల లాభాలు వచ్చాయని ప్రకటించారు. సభ్యుల పిల్లల్లో ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో ఉత్తమ మార్కులు సాధించినవారికి పారితోషికాల చెక్కులు ప్రదానం చేశారు. సినీ నిర్మాత బీకే శ్రీనివాస్ ముఖ్యులుగా పాల్గొని మాట్లాడుతూ ఖాతాదారులకు నమ్మకమైన సేవలతోపాటు వారి డిపాజిట్లకు రక్షణ కల్పిస్తేనే బ్యాంకులు మనుగడ సాధిస్తాయన్నారు. ఇటువంటి విధానాలను చరణ్ కోఆ-పరేటివ్ బ్యాంకు పాటిస్తోందని కితాబునిచ్చారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

విద్యుత్ టవర్ల పరిహారంలో అన్యాయం



రైతుసంఘం నాయకులు, సభ్యులు

▸▸ పోరాటానికి రైతుసంఘం సన్నద్ధం

చింతామణి, ఆగస్టు 18: కర్నాటక విద్యుత్ సరఫరా మండలి ఆధ్వర్యంలో రైతుల భూములలో నిర్మించిన విద్యుత్ టవర్ల ఏర్పాటుకు సంబంధించి పరిహారంలో అన్యాయం జరిగిందని దీనిపై పోరాటం చేయనున్నట్టు రాష్ట్రరైతు సంఘం, హసిరుసేన యువ విభాగం ప్రకటించింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీకే వినోద్ కుమార్‌గౌడ పట్టణ శివారులోని చింతామణి - శ్రీనివాసపుర రోడ్డులో గోపసంద్రలో ఒక రైతు భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్లను పరిశీలించారు. భూమి కోల్పోయిన రైతులకు తగిన పరి హారం ఇవ్వడంలో వంచన చేశా రని ఆరోపించారు. కేపీటీసీఎల్ చింతామణిలోని 220/66 కేవీ పవర్‌స్టేషన్ నుంచి 220/66 కేవీ మిట్టేమరి కేంద్రం వరకు 20కేవీ విద్యుత్ మార్గాలను ఏర్పాటు చేసింది. ఇందులో 66కేవీ చింతామణి - ఇరగంపల్లి ఎల్‌సీ లైన్ కారిడార్, 66కేవీ చింతామణి - గంజిగుంటె డీసీ లైన్ కారిడార్, 66కేవీ తలకాయలబెట్ట ఎస్‌సీలైన్ కారిడార్, 66 కేవీ గౌరిబిదనూరు - దిబ్బూరహళ్ళి - ఇరగంపల్లి ఎస్‌సీ లైన్ కారిడార్‌లకు అనుగుణంగా విద్యుత్ టవర్‌లు ఏర్పాటు చేశారు. చిక్కబళ్ళాపుర జిల్లా అధికారి ఆదేశాల ప్రకారం రైతుల భూమిలో ఏర్పాటు చేసిన టవర్‌కు అనుగుణంగా, కారిడార్‌ను పరిగణనలోకి తీసుకుని భూ పరిహారం, పంట, చెట్ల, యాజమాన్య నష్ట పరిహారాన్ని ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. టవర్‌కు వందశాతం, కారిడార్‌కు 60శాతం చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. అయితే కొంత మంది రైతుల భూములలో మూడు టవర్‌లను నిర్మించి కేవలం ఒకదానికి మాత్రమే పరిహారం ఇచ్చారని, కారిడార్‌కు అనుగుణంగా పరిహారం ఇవ్వకుండా కేపీటీసీఎల్ అధికారులు, కంట్రాక్టర్‌లు వంచన చేశారని ఆరోపించారు. భూమిలో 220కేవీ లైన్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్న చెట్లు, పంటలను తొలగించాల్సి ఉంటుందని, అయితే శాఖ వారు మాత్రం పట్టించుకోకుండా భూమిలో పొక్లైనర్ ఇతర యంత్రాలను తిప్పించి పంట నాశనం చేసి టవర్‌లు ఏర్పాటు చేశారని వినోద్‌కుమార్‌గౌడ ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా టవర్, లైన్ లాగేందుకు భూయజమానులనుంచి ఖాళీ స్టాంప్‌పేపర్‌లపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే చిక్కబళ్ళాపుర జిల్లా అధికారితో చర్చలు జరిపి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. గ్రామానికి చెందిన రైతులు మునియమ్మ, బుక్కనహళ్ళి ఆంజినప్ప, మునిస్వామి తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా రైతులు రాజేశ్, సొణప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మంజునాథ్, రత్నమ్మ, నారాయణస్వామి, లఘుమారెడ్డి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

100 మంది ఐఐటీ స్వదేశీ సేవకులకు సత్కారం



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో తమ సేవలు కొనసాగించాలని భావించి విదేశాలలో కీలకమైన హోదాలు, ఉద్యోగాలను వీడిన వందమంది ప్రముఖ ఐఐటీ నిపుణులను సత్కరించారు. 100 గ్రేట్ ఐఐటీయన్స్ డెడికేటెడ్ టు ది నేషన్ అనే పుస్తకాన్ని శనివారం ఐఐఎం బెంగళూరు డైరెక్టర్ రిషికేశ్ టీ కృష్ణన్ లాంచనంగా ఆవిష్కరించారు. కమాండర్ వీకే జైట్లీ పుస్తకాన్ని రచించారు. బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అనిల్ కే చౌదరి, ఓం ప్రకాశ్ కణ్ణ, సీజే కృష్ణదాస్ నాయర్, సతీశ్ కే మనోచా, ఆర్ఎం భాటియా, అశోక్ మిశ్రా, ఆర్ శ్రీకుమార్, దీపాంకర్ బెనర్జీ, విపార్థి ఆదిమూర్తి, డీ శివకుమార్, మహేశ్‌గుప్త, ఆర్ రమణన్‌లను సత్కరించారు. రిషికేశ్ టీ కృష్ణన్ మాట్లాడుతూ పుస్తకంలో ప్రధానంగా దేశంకోసం పాటుపడిన వ్యక్తుల సేవలను ప్రస్తావించడం సంతోషంగా ఉందన్నారు. గతంతో పోలిస్తే విదేశాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గిందన్నారు. బెంగళూరులో నివసిస్తున్న 200మంది ఐఐటీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రుణాలతో వ్యాపార అభివృద్ధి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

విజయపుర, ఆగస్టు 18: పట్టణంలోని సమృద్ధి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా లభించే రుణాలతో వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు ఎన్ రుద్రమూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నగరేశ్వరస్వామి ప్రార్థనా మందిరంలో ఆదివారం సొసైటీ 2024-25 వార్షిక సర్వసభ్య మహాసభలో సభ్యులు, షేర్ హోల్డర్‌లను ఉద్దేశించి మాట్లాడారు. సొసైటీ సామాజికసేవవా కార్యక్రమాలను ప్రస్తావించారు. సొసైటీ సభ్యులు, వాటాదారుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఈసారి కూడా ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డ్, 20 గ్రాముల వెండినాణెం ఇవ్వనున్నట్టు తెలిపారు. అంతేకాక ఇతర సంఘాలు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు సొసైటీలోని ధర్మనిధిని కేటాయిస్తున్నట్టు తెలిపారు. డైరెక్టర్ మనోహర్‌బాబు వార్షిక జమాఖర్చులను వివరించారు. మరో డైరెక్టర్ పునీత్‌కుమార్ సంఘం ఇస్తున్న డివిడెండ్ గురించి తెలిపారు. ఇదే సందర్భంగా అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, వెండినాణెం అందచేసి గౌరవించారు.

బీబీఎంపీలోకి 4 గ్రామ పంచాయతీలు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ పరిధిలోకి 4 గ్రామపంచాయతీలను విలీనం చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు. మైసూరు రోడ్డులోని కుంబళగోడు గ్రామ పంచాయతీ, ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని శాంతిపుర, కోనప్పన అగ్రహార, సర్జాపుర గ్రామ పంచాయతీలను బీబీఎంపీ పరిధిలోకి తీసుకురాదలిచారు. ఇటీవలే యశ్వంతపుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ కుంబళగోడు గ్రామపంచాయతీని బీబీఎంపీలో చేర్చాలని డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్‌ను కోరారు. గతంలో కె.గొల్లహళ్ళి, హెచ్.గొల్లహళ్ళి, సూలికెరెలను కలుపుతూ కుంబళగోడును ప్రత్యేక నగరసభను ఏర్పాటు చేయాలని భావించారు. ఈ ప్రాంతాలు గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ఏకంగా బీబీఎంపీలోకి విలీనం చేయాలని భావించారు. ఇక కోనప్పన అగ్రహార పంచాయతీలో 50వేల కంటే ఎక్కువ జనాభా ఉండడం, నగరం తరహాలో అభివృద్ధి చెందుతుండంతో పన్నులు పెంచుకోవచ్చునని బీబీఎంపీ భావిస్తోంది. శాంతిపుర పరిధిలో 2011 నాటికి 12వేలమంది జనాభా ఉండేవారు. ప్రస్తుతం 40వేలకు మించారు. దీంతో ఈ పంచాయతీ అభివృద్ధి కాలేదని రోడ్లు, తాగురు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి సదుపాయాలు రావాలంటే కార్పొరేషన్‌లో చేరడం సముచితమని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పన్నులు పెరుగుతాయనే భయం వెంటాడుతోంది. ప్రస్తుతంపాలికె పరిధి 857 చదరపు కిలోమీటర్లు ఉంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీ) అస్థిత్వానికి వస్తే 1400 చదరపు కిలోమీటర్లకు పెరగనుందని ఇటీవలే జీబీఏ బిల్లులో ప్రతిపాదించారు.

ఐటీసీ ఆధ్వర్యంలో సరికొత్త బిస్కెట్లు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీసీ సంస్థ వినియోగదారులు, చిన్నారుల కోసం పౌష్టికాంశాలతోకూడిన సూపర్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్లను లాంచనంగా విడుదల చేసింది. వివిధ రంగాల ప్రముఖులతో సుదీర్ఘ చర్చల అనంతరం సరికొత్తగా కోడి గుడ్డు, పాలు పౌష్టికాంశాలతో కూడిన బిస్కట్‌లను రూపొందించినట్టు సంస్థ సీఓఓ అలి హ్యారిస్ శేర్ మాట్లాడుతూ సరికొత్త బిస్కట్‌లు రూ.5, 10, 30 ధర ప్యాకింగ్‌లో లభిస్తాయన్నారు. ఈమేరకు నగరంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ఉత్పత్తుల ఆవిష్కరణ

విద్యతోనే సమాజ ప్రగతి



పురస్కారాల ప్రదానంలో సంఘం పదాధికారులు

▸▸ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దొడ్డబళ్ళాపుర, ఆగస్టు 18: విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని దేవర దాసిమయ్య మిత్ర మండలి నేకారర సంఘం నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. నేత కార్మిక వర్గానికి చెందిన ప్రతిభావంత విద్యార్థులకు సంఘం మూడో వార్షిక పురస్కారాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ముత్యాలమ్మగుడి పాళ్య ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యావంత సమాజం దేశ పురోగతికి సహకారి కానుందన్నారు. విద్య ద్వారా అన్ని రంగాల ప్రగతి ముడిపడి ఉందన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లా కసాప కార్యదర్శి ప్రొఫెసర్ కేఆర్ రవికిరణ్ మాట్లాడుతూ విద్యాసాధన సామాజిక ప్రగతికి దోహదపడనుందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో దొడ్డబళ్ళాపుర పాత్ర స్మరించుకోవడం అవసరమన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. సంఘం అధ్యక్షుడు రామమూర్తి అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడు రామణ్ణ, సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కోశాధికారి ముని నారాయణస్వామి, సహ కార్యదర్శి విజయకుమార్, డైరెక్టర్‌లు లక్ష్మీకాంత, బాబు, అనిల్‌కుమార్, మధుచంద్ర, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



అలంకరణలో హెంజేరు సిద్దేశ్వరస్వామి



భక్తరహళ్లి నరసింహస్వామి



జిల్లేడగుంట ఆంజనేయస్వామి

మడకశిర(అమరాపురం), ఆగస్టు 18 : అతి పురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అమరాపురం మండలంలోని హేమావతిలో ఆదివారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కడ వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులేకాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేయించారు. మండలంలోని ప్రసిద్ధిచెందిన భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు ఉన్న ఆంధ్ర, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుండెపోటుతో సైనికుడి మృతి



సునిల్ సలామ్ (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బెళగావిలో సైనికుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే వాహనాన్ని నిలిపే ప్రయత్నం చేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. కాసేపటికి గమనించిన స్థానికులు మృతి చెందినట్టు నిర్ధారించారు. శనివారం ఘటన చోటు చేసుకుంది. బెళగావిలోని మరాఠా లైట్ ఇన్‌ఫ్యాంట్రీ రెజిమెంటరీ సెంటర్ (ఎంఎల్ఐఆర్‌సి)లో హవాల్దార్‌గా పనిచేస్తున్న సునిల్ సలామ్ (37) మృతి చెందినవారు. సునిల్ బైక్ నుంచి కింద పడిపోయే దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి. మహారాష్ట్రలోని చందగడ తాలూకా ఘళేవాడికి చెందిన సునిల్ సలామ్ కొంతకాలంగా ఇక్కడే పనిచేస్తున్నారు. సునిల్ సలామ్ అకస్మిక మృతి పట్ల తోటి సైనికుల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మెడికో ఘటనపై... బీజేపీ ర్యాలీ



కొవ్వొత్తులతో బీజేపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

శిడ్లఘట్ట, ఆగస్టు 18: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మెడికోపై సామూహిక అత్యాచార ఘటనను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులో ర్యాలీ నిర్వహించారు. శిడ్లఘట్ట పట్టణంలోని సేవాసౌధ కార్యాలయం నుంచి కోటె సర్కిల్ వరకు కాలినడకను సాగారు. మెడికల్ విద్యార్థిని హత్య ఘటనను ఖండించారు. గ్రామీణ అధ్యక్షుడు సీకల్ ఆనంద్‌గౌడ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్యులు దేవుళ్లతో సమానమన్నారు. అయితే వైద్యుల ప్రాణాలకే రక్షణ కరువైందని విచారం వ్యక్తం చేశారు. ర్యాలీలో పార్టీ జిల్లా సంచాలకులు కనక ప్రసాద్, తాజా మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, పట్టణ హోబళి అధ్యక్షుడు నరేశ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చాతుర్య, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సోమశేఖర్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు కదీర్‌పాష, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆనూరు శివకుమార్, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలను ధ్వంసం చేసిన స్థానికులు



ద్విచక్ర వాహనాలను పడేస్తున్న స్థానికులు

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వీలింగ్ చేసేవారి వేధింపులు తట్టుకోలేకపోతున్నామని రెండు ద్విచక్రవాహనాలను ఫ్లై ఓవర్‌నుంచి కిందకు పడేసి ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. నెలమంగల సమీపం లోని అరసినకుంటె నుంచి అడకనమారేహళ్ళి దాకా బైక్ వీలింగ్ చేస్తున్న వారిని స్థానికులు పట్టుకున్నారు. రెండు వాహనాలను సుమారు 30 అడుగుల ఎత్తైన ఫ్లై ఓవర్ నుంచి కిందకు పడేశారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకోగా శని వారం వీడియోలు వైరల్ అయ్యాయి. నెలమంగల జాతీయ రహదారిపై ఇకపై ఎవరు వీలింగ్ చేసినా ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్థానికులు హెచ్చరించారు. ఓవైపు స్థానికులనుంచి ప్రశంసలు వ్యక్తం అవుతుండగా వాహనాలు ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమనే విమర్శలు వ్యక్తమయ్యాయి. వీలింగ్ చేస్తున్న వారు పరారయ్యారు.

కొంకల్లులో వైద్య శిబిరం

గుడిబండ, ఆగస్టు 18 : మండలంలోని కొంకల్లులో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఈఓఆర్డీ నాగరాజు నాయక్ పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ తెలిపారు. గ్రామంలో జ్వరాలు, వాంతులు, విరేచనాలు అయినవారికి శిబిరంలో మందులు, మాత్రలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజీ, మురుగు కాలువలు, చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పైప్ లీకేజీకి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు వారు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.85	1,628.02
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	44,038	1,526
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	24,500	9,824
సామర్థ్యం (టీఎంసీలు)	72.79	86.80

పిల్లల ప్రతిభను ప్రోత్సహించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల అధ్యక్షుడు మహిపాల్

బళ్లారి సిటీ, ఆగస్టు 18: పిల్లల ప్రతిభను ప్రోత్సహించాలని డాక్టర్ మహిపాల్ అన్నారు. నగరంలోని బసవరాజేశ్వరి పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రతిభా సంగమం విద్యార్థుల ఎదుగుదలకు గొప్ప అవకాశం అని విద్యార్థులు, ఉపాధ్యాయులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కల్యాణ కర్ణాటక వికాస అకాడమీ, బళ్లారి సేడం కొట్టాల బసవేశ్వర భారతీయ శిక్షా సమితి, బసవరాజేశ్వరి పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన తాలూకాస్థాయి ప్రతిభా సంగమాన్ని తులసి మొక్కకు నీరు పోసి ఆయన ప్రారంభించారు. పిల్లల ప్రతిభను బయటకు తీసుకురావడానికి ఉపాధ్యాయులకు చిత్త శుద్ధి అవసరమన్నారు. బసవరాజేశ్వరీ పాఠశాలలో నిర్వహించిన ప్రసంగం, చిత్రలేఖనం, క్విజ్, టగ్ ఆఫ్ వార్, కోలాటం, భజన, రంగోలి, బృందనృత్యం, పాటలు, తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కల్యాణ కర్ణాటక వికాస్ అకాడమీ జిల్లా అధ్యక్షుడు అడవిస్వామి బహుమతులను అందజేశారు. అతిథులుగా కురుగోడు మండల విద్యాశాఖాధికారి నయీమూర్ రెహమాన్, అక్షర దాసోహ యోజన సహాయ సంచాలకులు మల్లప్ప, అన్‌ఎయిడెడ్ పాఠశాల అధ్యక్షుడు మరిస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి



నిరసన తెలుపుతున్న చిన్నారి బంధువులు

బళ్లారి సిటీ, ఆగస్టు 18: హొసపేట నగరంలోని తల్లి బిడ్డల ప్రసూతి ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ బిడ్డ మరణించడంతో స్థానికులు నిరసన తెలిపారు. పికే హళ్ళి గ్రామానికి చెందిన తాయప్ప భార్యకు పురిటి నొప్పులు రావడంతో హొసపేట నగరానికి శనివారం అర్ధరాత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించారు. తల్లిని ఆసుపత్రిలో చేర్చకుండా తాత్సారం చేసిన వైద్యుడి బాధ్యతారాహిత్యం కారణంగా శిశువు శ్వాసకోశ సమస్యలకు గురైంది. డెలీవరీ అయిన మహిళ బంధువులకు ఉదయం వరకు వేచి ఉండాలని వైద్యుడు చెప్పాడు. ఉదయం కొప్పళ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వర్తించిన వైద్యులపై విచారణ జరిపి వెంటనే విధుల నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

రేపటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



సిరుగుప్ప, ఆగస్టు 18: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శ్యామాచార్య తెలిపారు. సిరుగుప్ప పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో 20వ తేదీ పూర్వారాధన, 21వ తేదీ మధ్యారాధన, 22న ఉత్తరారాధన కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. 22వ తేదీ పట్టణ పురవీధుల్లో రథోత్సవం జరుగనున్నట్లు తెలిపారు భక్తులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

చిదానందప్ప యాదవ్‌కు సన్మానం

బళ్లారిరూరల్, ఆగస్టు 17: బళ్లారి నూతన జిల్లా పంచాయతీ కార్యాలయంలో కేతు చిదానందప్ప యాదవ్‌ను కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్, కేపీసీసీ అధికార ప్రతినిధి వెంకటేష్ ఆదివారం వారి కార్యాలయంలో సన్మానించారు.

గవర్నర్ వైఖరిపై భగ్గు

- గెహ్లోట్ పక్షపాత వైఖరి గర్హనీయం
- గడిగి చెన్నప్ప సర్కిల్లో కాంగ్రెస్ నిరసన



గడిగి చెన్నప్ప సర్కిల్లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 18: వివాదాస్పద కేసులో ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతినిస్తూ గవర్నర్ థావరచంద్ గెహ్లోట్ పక్షపాతంతో వ్యవహరించడం గర్హనీయమని కర్ణాటక రాష్ట్ర దోపిడీ వ్యతిరేకవర్గాల మహాసంఘం జిల్లాధ్యక్షుడు గాదిలింగనగౌడ అన్నారు. నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో జరిగిన నిరసన కార్యక్రమానికి ఆయన నాయకత్వం వహించి మాట్లాడారు. ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని బేషరతుగా ఉపసంహరించుకోవాలని ఆయన గవర్నర్‌ను డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న డాక్టర్ బాబు జగ్జీవనరామ్ లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధ్యక్షులు ముండ్రగి నాగరాజు మాట్లాడుతూ, సిద్దరామయ్య ఎలాంటి కళంకం లేని నాయకుడని, ఆయనపై అనవసర విచారణకు అనుమతించారన్నారు. గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసలు చేపడుతామన్నారు. సీఎం సిద్దరామయ్యపై కుట్రలు పన్నిన బీజేపీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ సిద్దరామయ్య పేదలపక్షపాతి అని, ఆయన ఇచ్చిన ఐదుహామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజల జీవితాలు బాగుపడ్డాయన్నారు. ఇదిచూసి బీజేపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామిపై పది నెలలుగా ప్రాసిక్యూషన్ పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోని గవర్నర్ గెహ్లోట్ సీఎం సిద్దరామయ్య విషయంలో ఓ బ్లాక్‌మెయిలర్ చేసిన ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవడం ఆయన పక్షపాత వైఖరికి నిదర్శమన్నారు. నిరసనలో కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు తదితరులు భారీగా పాల్గొన్నారు.

భారీ వర్షంతో ఇళ్లలోకి చేరిన నీరు



ఇంటిలోకి నీరురావడంతో ఇబ్బందులు పడుతున్నఓ కుటుంబం

కంప్లి, ఆగస్టు 18: కంప్లి పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కంప్లి సోమప్ప చెరువు పక్కన నివసించే ఖాజావలి ఇల్లు విజయనగర కాలువ పక్కన వుండటంతో భారీ వర్షం రావడంతో రాత్రి నిద్రిస్తున్న వేళ ఇంటిలోకి నీరు చేరింది. ఖాజావలీ అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సామాగ్రితో పాటు ఆహార ధాన్యాలు పూర్తిగా నీటిలో కలసిపోయాయి. గత మూడు సంవత్సరాలుగా వర్షాలు వచ్చిన సమయంలో ఈ సమస్యలు ఎదురవుతున్నాయని అతడు తెలిపాడు. ఇప్పటికైనా పురసభ శాఖ అధికారులు, కాలువ అధికారులు గానీ నీరు సక్రమంగా ముందుకెళ్లేలా చూడాలని కోరారు. గ్రామ లెక్క అధికారులు అక్కడకు చేరుకుని పరిహారం ఇప్పిస్తామని హామీఇచ్చారు.

నేటి నుంచి ద్విచక్రవాహనాలకు వంతెనపై అనుమతి



కంప్లికి కాలినడకన వస్తున్న విద్యార్థులు

కంప్లి, ఆగస్టు 18 : కంప్లి కోట వంతెనపై కొన్ని రోజులుగా కాలినడకతో ప్రయాణం కొనసాగిస్తున్నవారికి అధికారులు శుభవార్త చెప్పారు. జలాశయం నుంచి నదికి నీటి ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఆదివారం వంతెనను పరిశీలించారు. మొదటి విడతలో ద్విచక్రవాహనాలకు అనుమతి ఇస్తున్నట్లు రోడ్డుశాఖ అధికారులు విశ్వనాథ్ తెలిపారు. నేటి నుంచి ద్విచక్రవాహనాలకు అనుమతి రావడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సుమారు 20 రోజులకు పైగా ఈ వంతెనపై వాహనాల రాకపోకలు బంద్ కావడంతో ఎంతో మంది ప్రయాణికులు, విద్యార్థులు, రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేటితో కష్టాలు తొలిగాయని విద్యార్థులు పేర్కొన్నారు. ఆటోలు, కార్లకు మరికొన్ని రోజుల అనంతరం బ్రిడ్జిపై పరీక్షలు నిర్వహించి అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు.

కార్మికుల శ్రమ అభినందనీయం

క్రస్ట్‌గేటు మరమ్మతులో శ్రమించిన వారిని సన్మానించిన ఎంపీ






కార్మికులకు మిఠాయిలు తినిపించిన అనంతరం వారిని శాలువాలతో సన్మానిస్తున్న రాయచూరు ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, ఆగస్టు 18: వరద ప్రవాహం ధాటికి తెగిపడిపోయిన తుంగభద్ర 19వ క్రస్ట్‌గేట్‌ను తిరిగి మరమ్మతులు చేయడంలో సిబ్బంది కార్మికులు చేసిన శ్రమ అభినందనీయమని రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ అన్నారు. ఆదివారం తుంగభద్ర డ్యాంను పరిశీలించిన ఆయన, అక్కడ పని జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాను సివిల్ సర్వీస్‌లో చేరక ముందు ఇంజనీరింగ్ చదివి ఇంజనీయర్‌గా విధులు నిర్వహించానన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎంత కష్టంతో కూడుకున్నవో తనకు అనుభవంలో తెలుసునన్నారు. రాత్రింబవళ్లు శ్రమించి గేట్‌ల మరమ్మతుచేసి 40 టీఎంసీల పైగా నీటిని కాపాడడంలో అధికారులు చూపిన శ్రద్ధ, సిబ్బంది చేసిన కృషి, కార్మికులు పడిన శ్రమ రైతులకు సంతోషాన్ని మిగిల్చాయన్నారు. అదృష్టవశాత్తు పైభాగంలో ఇప్పటికి వర్షాలు కురుస్తుండడంతో వరద ప్రవాహం తగ్గలేదనీ, త్వరలోనే జలాశయం పూర్తిస్థాయిలో నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని నాలుగు జిల్లాలతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులకు జీవనాడిగా ఉన్న తుంగభద్ర డ్యాంలోని నీటిని కాపాడడంలో ఇక్కడి కార్మికులు పడిన శ్రమకు అభినందనలు తెలుపుతున్నట్లు కుమార్ నాయక్ పేర్కొన్నారు. రాత్రింబవళ్లు శ్రమించిన కార్మికులకు ప్రభుత్వ పరంగా తగిన బహుమానం దక్కాల్సి ఉందన్న ఎంపీ, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని కార్మికులకు హామీ ఇచ్చారు.

నదిలో బయటపడిన కొట్టుకుపోయిన క్రస్ట్‌గేటు



తుంగభద్ర నదిలో బయట పడిన విరిగిన క్రస్ట్‌గేటు ముక్కలు

హొస్పేట్, బళ్లారి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 10వతేదీ రాత్రి తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేటు ప్రమాదవ శాత్తు గేటు కొట్టుకు పోయింది. ఇప్పటి దాకా ఆ గేటు డ్యాంలోకి పడిపోయిందా? లేక నదిలో కొట్టుకుపోయిందా? అనే అనుమానం అందరిలోనూ ఉండేది. ఈ నేపథ్యంలో తెగిపోయిన క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేశారు. స్టాప్‌లాగ్ ఎలిమెంట్ బిగింపు శనివారం పూర్తికావడంతో డ్యాం నుంచి నదికి నీటి విడుదల ఆపేశారు. నదిలో నీరు ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో తెగిపోయి కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు డ్యాం సమీపంలోని నదిలో బయటపడింది. గేటు ముక్కలు ముక్కలుగా తెగి పోయి నదిలోని ఇసుకలో కనిపించింది.

ఎంపీ సతీమణికి సన్మానం



ఎంపీ తుకారామ్ సతీమణి అన్నపూర్ణను సన్మానిస్తున్న మహిళా సంఘాలు

తోరణగల్లు, ఆగస్టు 18 : సండూరు పట్టణం గురు భవనంలో ఎంపీ తుకారామ్ సతీమణి అన్నపూర్ణకు సండూరు, స్కందగిరి, సంజీవిని తాలుకాలోని గ్రామ పంచాయతీ ఒక్కుట సంఘాల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణతుకారామ్ మాట్లాడుతూ స్వావలంబనతో సమాజం జీవించడానికి, సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి ఇటువంటి ఒక్కుట సంఘాలు అత్యంత ఆవశ్యకమని తెలిపారు. అందరితో పాటు తాను వుంటానని తెలిపారు. ఈ సందర్భంగా తాలుకాస్థాయి గ్రామ పంచాయతీ స్థాయి సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టుదలతో దేన్నయినా సాధించవచ్చు



పట్టణంలో మోహన్‌కుమార్ దానప్పను అభినందించిన ప్రముఖులు

కంప్లి, ఆగస్టు 18 : కంప్లికి చెందిన మోహన్‌కుమార్ దానప్ప పట్టుదల, దీక్షతో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలోనే గుర్తింపు పొందారని దళిత ప్యాంథర్ సంఘం జిల్లా అధ్యక్షులు కాటంరాజు తెలిపారు. ఏసీ దానప్ప కుమారుడు మోహన్‌కుమార్ దానప్ప మొదటి దశలో హైకోర్టుకు కేంద్ర సర్కారు నుంచి లాయర్‌గా నియమితులయ్యారన్నారు. అనంతరం రాష్ట్ర పోలీసు శాఖ ప్రతినిధిగా కూడా ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన పట్టుదల, దీక్షతోనే ప్రజలకు అనుగుణంగా వుండే హోదాలో ఎన్నికై తండ్రికి తగ్గకుమారుడిగా కంప్లి పట్టణంలో గుర్తింపు పొందారన్నారు. ఆయన కంప్లికి రావడంతో శనివారం వివిధ సంఘ సంస్థ నేతలు గజమాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ దానప్ప మాట్లాడుతూ తల్లిదండ్రులు తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ సేవకుడిగా నిలుస్తామని తెలిపారు. వారితో పాటు జడయ్యస్వామి, పట్టణ ప్రముఖులు హేమయ్యస్వామి, బసన్నగౌడ, కొట్టూరు రమేష్, బూదిగుంప అంబన్న, మౌనేష్, బూదిగుంప హుస్సేన్ సాబ్ చిత్రకార్ జడియప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పిల్లలకు విద్య నేర్పించాలి



మేకార ప్రముఖులను అభినందిస్తున్న దృశ్యం

కంప్లి, ఆగస్టు 18 : పిల్లలను తల్లిదండ్రులు విద్యావంతులుగా తీర్చిదిద్దాలని మేకార స్వకుళసాళి సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య తెలిపారు. శనివారం మేకార స్వకుళసాళి సమాజం చౌడేశ్వరి దేవస్థానంలో ఏర్పాటు చేసిన జిహ్నేశ్వర జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఈ సమాజంలో పనులకు పరిమితం కాకూడదని, ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు రావాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్వకుళసాళి సమాజానికి భవనం నిర్మించాలన్నారు. అలాగే పలువురు ప్రముఖులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి సుధాకర్, అధ్యక్షులు అంజినప్ప, పక్కీరప్ప, శ్రీకండే, ప్రకాష్, భరత్‌కుమార్, మాలేకర్, సరోద గురురాజ్, మల్లికార్జున, శ్రీదేవి, గీత, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కోల్‌కతా వైద్యురాలి హత్యపై నిరసన



హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల డాక్టర్ల నిరసన

హోసూరు ఆగస్టు 18:కోల్కతాలో మహిళా వైద్యురాలి దారుణ హత్యను ఖండిస్తూ ఆదివారం నిరసనల హోరు కొనసాగింది. హోసూరులోని సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్, ఇండియన్ కళాశాల హాస్పిటల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో 150 మందికి పైగా వైద్యులు 300 మందికి పైగా వైద్య విద్యార్థులు, మెడికల్ అసిస్టెంట్లు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది ఈ నిరసనలో పాల్గొన్నారు. బ్యానర్లు పట్టుకుని నిరసన చేపట్టారు. డాక్టర్ హత్యపై దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నినాదాలు చేశారు. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల వైద్యులు ప్రసాద్ చరంగవి, డాక్టర్ నికిల్ భరద్వాజ్, డాక్టర్ రోజ్ బెతాలజీ డాక్టర్ ఇంద్రశ్రీ నిర్మల్ కుమార్, సయ్యద్ సఖాబాయ్, జోస్ జయరాజ్, అరవింద్ కుమార్, రాఘవన్, సారికతో సహా 650 మంది పాల్గొన్నారు. హోసూరు ప్రభుత్వ ఆసుపత్రి, గుణం ఆసుపత్రి, కావేరి ఆసుపత్రి, మీరా ఆసుపత్రి వైద్యులు తమ తమ ఆసుపత్రుల ఎదుట నిరసన కార్యక్రమం జరిపారు.

వర్షాలతో వేరుశనగ పంటకు జీవం

హోసూరు, ఆగస్టు 18: కృష్ణగిరి జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎండిపోయిన వేరుశనగ మొక్కలు మళ్లీ జీవం పోసుకోవడంతో రైతులు ఆనందిస్తున్నారు. ముఖ్యంగా హోసూరు. కృష్ణగిరి, శూలగిరి, బర్గూరు, ఊత్తంగరై, కావేరిపట్టణం, బాగలూరు, బేరికై, హోసూరు, డెంకణీకోట, తళి, అంచెట్టి, ప్రాంతాల్లో వేలాది మంది రైతులు వేరుశనగ సాగుచేస్తున్నారు. ఎండల ప్రభావం వల్ల పెరగడంతో వేరుశనగ పూత రాలిపోయింది. తిరిగి కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి పంట దిగుబడులు బాగా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వలస కార్మికుల పిల్లలు బడిలో చేరాలి

హోసూరు, ఆగస్టు 18: బతుకుదెరువుకోసం వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన వలస కార్మికుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చొరవ చూపాలని హోసూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. హోసూరు కార్పొరేషన్‌లోని అందివాడి ప్రాంతంలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులను కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు క్లీనర్ల నివాస ప్రాంతాలను సందర్శించి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో కొంతమంది బడి ఈడు పిల్లలు పాఠశాలకు హాజరు కావడం లేదని గుర్తించారు.. కారణం అడిగినప్పుడు వారి తల్లిదండ్రులు పని కోసం ఇతర రాష్రాల నుంచి మూడు రోజుల క్రితం హోసూరు ప్రాంతానికి వలస వచ్చినట్లు తెలిపారు. ఆ పిల్లలను వెంటనే బడిలో చేర్పించాలని కమీషనర్ ఆదేశించడంతో అందివాడి ప్రాంతంలోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఈ 23 మంది చిన్నారులను చేర్పించారు. కమిషనర్ వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, డాక్టర్ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజారాం. అధికారులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను ఆలకిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్

కట్టుకున్న చీరను విప్పి.. నీటమునిగిన వ్యక్తిని కాపాడి..

- కాలువలో కొట్టుకుపోతున్న యువకుడిని రక్షించిన మహిళ

రాయచూరు, ఆగస్టు 18: జిల్లాలోని లింగసుగూరు తాలూకా రోడలబండా గ్రామంలో ఆదివారం కాల్వలో కొట్టుకుపోతున్న యువకుడిని మహిళ ఒకరు తాను కట్టుకున్న చిరను విప్పిమరి కాపాడిన అద్భుత సంఘటన చోటుచేసుకుంది. ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఒకరు తన స్నేహితులతో కలిసి నారాయణపూర కుడికాల్వలో స్నానం చేస్తుండగా ప్రవాహం ఎక్కువ కావడంతో కొట్టుకుపోయాడు. ఆతనికి తోడుగా వచ్చిన మరో యువకుడితో పాటు ఇంకో యువకుడు కూడా ఆయనను రక్షించే ప్రయత్నం చేయగా వారిద్దరు నీళ్లల్లో అదుపుతప్పి పడిపోయారు. దీన్ని అటువైపు నుంచి పొలం పనికొ వెళుతున్న మహిళ ఒకరు గమనించి వెంటనే కాలువ దగ్గరకు పరగెత్తి తాను కట్టుకున్న చీరను విప్పిమరి ఆ యువకుడికి విసిరివేసి కాల్వలో నుంచి రక్షించింది. దీంతో కాల్వ బయటికిబడి ప్రాణం రక్షించుకున్న యువకుడు మహిళకు ధన్యవాదాలు తెలిపి అక్కడి నుంచి వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు. కాల్వ నుంచి బయటపడిన యువకుడి వివరాలు తెలియవని ఎవరో తాము గుర్తించలేకపోయామంటు గ్రామస్థులు తెలిపారు. కాగా తన ఒంటిపై ఉన్న చీరను విప్పిమరి యువకుడి ప్రాణాలను కాపాడిన మహిళను గ్రామస్థులతో పాటు చుట్టుపక్కలందరు అభినందనలతో ముంచెత్తారు.

కోల్‌కతా ఘటనపై రిమ్స్ విద్యార్థుల నిరసన

రాయచూరు, ఆగస్టు 18 :పశ్చిమ బెంగాల్ కోల్కతాలోని వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యను నిరశిస్తూ నగరంలోని రిమ్స్ కళాశాల విద్యార్థులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన విద్యార్థులు వైద్యకళాశాలల్లో భద్రత పెంచాలని బాధ్యులైన దుండగులను శిక్షించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ విషయంలో పాలకులు ఎలాంటి ఒత్తిడిలకు లొంగవద్దని విద్యార్థులు డిమాండ్ చేశారు.

సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా మద్యం దొంగ గుర్తింపు



సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

రాయచూరు, ఆగస్టు 18: లింగసుగూరు తాలూకా మాకాపూర్ గ్రామ సమీపంలోని ఢాబాలో మద్యం దొంగతనానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని సీసీ కెమెరాల ఆధారంగా ఆదివారం గుర్తించారు. ఈ డాబాలో గత కొన్ని రోజులుగా తరచుగా దొంగతనం జరుగుతుండడంతో డాబా యజమాని బసవరాజ్ ముదగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనానికి వచ్చిన నిందితుడు కేవలం లోకల్ బ్రాండ్ మద్యం బాటిళ్లను మాత్రమే ఎత్తుకెళుతున్నట్లు వివరించారు. పోలీసుల సూచన మేరకు ఢాబాలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియని నిందితుడు యథావిధిగా మద్యం బాటిళ్ల కోసం వచ్చి సీసీ కెమెరా కళ్లకు దొరికిపోయాడు.